నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 179 రంగారెడ్డి | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 30-10-2026 october | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

గ్లోబల్ ఇన్వెస్టర్లతో రేవంత్ భేటీ

- పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం
- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్
- వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ..
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై వివరణ



నిర్భయవార్త ప్రతినిధి : **హైదరాబాద్: తెలంగాణలో** భారీ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. డిసెంబర్ 7 నుంచి9వరకుఫ్యూచర్‌సిటీలోనిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌కు సంబంధించి నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల అధిపతులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులు, పారిశ్రామిక అభివృద్ధికి అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ఉన్న అవకాశాలను పరిచయం చేయడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టడంపై దృష్టి సారించనున్నారు.

ఫ్యూచర్ సిటీ వేదికగా గ్లోబల్ సమిట్

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చేలా ఈ గ్లోబల్ సమిట్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దేశాల ప్రతినిధులు, పారిశ్రామిక రంగ ప్రముఖులతో సంప్రదింపులు జరపడం ద్వారా పెట్టుబడులపై ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

రేవంత్ రెడ్డి అభినవ నీరో

- ప్రజాభిప్రాయ సేకరణకు పిలిచి అరెస్టులు చేయడమేనా?
- తెలంగాణ అంతటా కరవు పరిస్థితులు..
- మూసీ సుందరీకరణకు నిధుల ఖర్చుపై కేటీఆర్ ఫైర్



నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని, రైతులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా మూసీ సుందరీకరణ పేరుతో భారీగా నిధులు వెచ్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు పిలిచి, తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నవారిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తీరును అభినవ నీరోతో పోలుస్తూ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటామని చెబుతున్న ప్రభుత్వం, అదే అంశంపై ప్రశ్నలు లేవనెత్తే వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజల ఆలోచనలు, అభ్యంతరాలు, సూచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం కల్పించడమని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం పేరుతో కార్యక్రమాలు నిర్వహించి, విమర్శలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.

కరవు పరిస్థితులపై దృష్టి పెట్టాలి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు సాగునీరు, పంటలు, పెట్టుబడుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల తక్షణ అవసరాలు, వ్యవసాయ రంగ సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం మూసీ సుందరీకరణకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజాధనాన్ని ఖర్చు చేసే విధానం పారదర్శకంగా ఉండాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు వ్యయం, నిధుల వినియోగం, నిర్వాసితుల సమస్యలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి, భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల అభ్యంతరాలను గౌరవించాలని, విమర్శలను అణచివేసే చర్యలకు బదులుగా ప్రజలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.



పీఎం రహత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రోడ్డు ప్రమాద బాధితులకు ₹ 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే

నిర్భయవార్త ప్రతినిధి : **రాజన్న సిరిసిల్ల :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడే లక్ష్యంతోకేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నపీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే సూచించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పథకం కింద అర్హత నిబంధనలకు అనుగుణంగా రోడ్డు ప్రమాద బాధితులు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు, ఏడు రోజులపాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని ఏడు ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ఎస్పీ అన్నారు. ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రికి తరలించి, అత్యవసర చికిత్స అందేలా ప్రజలు సహకరించాలని కోరారు. బాధితులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. ప్రమాద సమయంలో క్షతగాత్రులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని, అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేసి పోలీసుల సహకారం పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

నిర్భయవార్త

సంపాదకీయం

శుక్రవారం 30 అక్టోబర్ 2026

రోగుల ప్రయోజనాలే ముఖ్యం


ఔషధ ధరల నియంత్రణ వ్యవస్థ మొత్తం తయారీ సంస్థలకు తోడ్పాటునందించేలా పని చేస్తున్నట్లుందని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య ప్రజారోగ్య రంగంలో నెలకొన్న దుస్థితికి నిదర్శనం. దేశంలో ఔషధాల ధరలను నియంత్రించేలా ఆదేశాలివ్వాలని, రోగులకు జనరిక్ మందులను సిఫార్సు చేయని వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన రెండు పిటిషన్లపై మంగళవారం జరిపిన విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పలు కీలకాంశాలను లేవనెత్తింది. మందుల ధరల విషయంలో రోగుల ప్రయోజనాల కంటే కంపెనీల వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం దక్కుతున్న తీరుపై విస్మయం వ్యక్తం చేసిన న్యాయస్థానం దానిని నిరభ్యంతరంగా కొనసాగిసస్తున్న ప్రభుత్వ తీరుపై వ్యక్తం చేసిన ఆగ్రహం పూర్తిగా సమర్థనీయం. చిల్లర వ్యాపారికి రూ. 15కే అందుతున్న మందుపై గరిష్ఠ చిల్లర ధర రూ. 250గా ఉండటాన్ని, కొన్ని ఔషధాల విషయంలో చిల్లర ధరకు, రిటైలర్‌కు సరఫరా చేసే ధరకు మధ్య 300 నుంచి 400 శాతం లేదా అంతకంటే ఎక్కువ వ్యత్యాసం ఉండటాన్ని ఎలా సమర్థిస్తారు? ఆ వ్యత్యాసం వల్ల లబ్ధి పొందుతున్నదెవరు, రోగులపై ఇంతటి భారం ఎందుకు వేస్తున్నారంటూ న్యాయస్థానం వేసిన ప్రశ్నలకు ప్రభుత్వం నుండి స్పష్టమైన సమాధానం రాకపోవడం విస్మయకరం. ఔషధాల ధరలపై అత్యున్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు, లేవనెత్తిన ప్రశ్నలు ప్రభుత్వానికి, ధరల నియంత్రణ సంస్థలకు కనువిప్పు కావాలి. ప్రాణాలను నిలబెట్టే మందులను కేవలం వాణిజ్య సరుకుగా చూడలేం. రోగికి మందు కొనడం ఐచ్ఛికం కాదు. అత్యవసరం. అలాంటప్పుడు కంపెనీల లాభాలు, మార్కెట్ పోటీ పేరుతోఅధిక ధరలను నిర్ణయించడం, వాటిని ప్రభుత్వం సమర్థించడం అన్యాయం. ప్రభుత్వ విధానం ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, కొనుగోలు శక్తిని దృష్టిలో పెట్టుకోవాలి తప్ప ఔషధ పరిశ్రమ ప్రయోజనాలను కాదు. ప్రస్తుతం ధరల నియంత్రణలో ఉన్న షెడ్యూల్డ్ (అత్యవసర) మందులు ధరల గణనలో 16 శాతం రిటైలర్ మార్జిన్‌ను పరిగణనలోకి తీసుకుంటుండగా, షెడ్యూల్ పరిధిలో లేని మందుల విషయంలో ఇటువంటి పరిమితి లేకపోవడం ధరల వ్యత్యాసాలకు అవకాశం కల్పిస్తోంది. ఈ నాన్ షెడ్యూల్ మందులలో కూడా కొన్ని అత్యవసర, ప్రాణాధార మందులు ఉండటం గమనార్హం. కాన్సర్ మందులపై 30 శాతం ట్రేడ్ మార్జిన్ పరిమితి విధించినట్లు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చింది. అదే సమయంలో, కొన్ని కాన్సర్ మందుల విషయంలో రిటైలర్‌కు సరఫరా ధర రూ. 2,700 ఉండగా గరిష్ఠ చిల్లర ధర రూ. 27,000గా ఉన్న విషయాన్ని న్యాయస్థానమే ప్రస్తావించడంతో పాటు, ఈ దోపిడి కొనసాగాల్సిందేనా అని ప్రశ్నించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. నిజానికి మన దేశంలో ఏటా కేన్సర్ కారణంగా పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారు. రాన్నున్న ఏళ్లలో కాన్సర్ రోగుల సంఖ్య భారీగా పెరగనుందన్న అంచనాలు ఉన్నాయి. పేద ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ నేపథ్యాన్ని పరిశీలించనప్పుడు కాన్సర్ ఔషధాల ధరలు ఎంత తగ్గితే అంత మేలన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇతర ప్రాణాంతక వ్యాధులదీ ఇదే స్థితి. జాతీయ ఔషధ ధరల నిర్ణయ సంస్థ (ఎన్.పి.పి.ఎ) క్రియాశీలతను కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ధరలను పర్యవేక్షించి, అధిక ధరలపై చర్యలు తీసుకోవాల్సిన సంస్థ నిర్వీర్యంగా ఎందుకు మారిందన్న ధర్మాసనం ప్రశ్నను తేలికగా తీసుకోవడానికి వీలు లేదు. మందుల గరిష్ఠ చిల్లర ధరలు, రిటైలర్‌కు సరఫరా ధరలు, తయారీదారులు నిర్ణయిస్తున్న ధరలు, ఆసుపత్రులు వసూలు చేస్తున్న ధరల మధ్య వ్యత్యాసాలను ఎన్.పి.పి.ఎ నిరంతరం పరిశీలించాలి. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చర్యలు తీసుకోవడంతోపాటు, అధికంగా వసూలు చేసిన మొత్తాలను రికవరీ చేయాలి. ఔషధ కంపెనీల నుంచి వివరాలు సేకరించడం, ధరల నిర్ణయానికి సంబంధించిన లెక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, అవసరమైన చోట ధరలను నియంత్రించడం వంటి బాధ్యతలను ఆ సంస్థ సక్రమంగా నిర్వర్తించాలి. ధరల వ్యత్యాసాలపై రూ. 8,700 కోట్ల మేర ఔషధ సంస్థల నుంచి రికవరీలు పెండింగ్‌లు ఉన్నా, వాటిని వసూలు చేసుకోలేకపోవడం ఎన్.పి.పి.ఎ పని తీరుకు నిదర్శనం. రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని లాభాలు ఆర్జించే పరిస్థితికి అడ్డుకట్ట వేయడం ప్రభుత్వానికీ, ఎన్.పి.పి.ఎ కూ తప్పనిసరి బాధ్యత. అన్ని మందులపై పారదర్శకమైన, సమర్థమైన ధరల నియంత్రణను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తీసుకురావాలి. కంపెనీల లాభాల పరిరక్షణ పేరుతో రోగులపై భారం మోపడానికి ఎంత మాత్రం వీల్లేదు. ఔషధ పరిశ్రమ అభివృద్ధి చెందాలి. కానీ ఆ అభివృద్ధికి రోగులు మూల్యం చెల్లించకూడదు. ధరల నియంత్రణ వ్యవస్థకు కంపెనీల లాభాలు కొలబద్ద కాకూడదు. ప్రజల ప్రాణాలు, రోగుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలి! సుప్రీం వ్యాఖ్యల సారాంశం ఇదే!

స్నేహం ముసుగులో సైబర్ మోసాల ఉచ్చు!

స్నేహం కోసం తెరిచిన తలుపుల గుండా సైబర్ నేరగాళ్లు ప్రవేశిస్తున్నారు. పరిచయాలు పెంచుకోవడానికి, ఆప్తులతో అనుబంధాలను కొనసాగించడానికి ఏర్పడిన సామాజిక మాధ్యమాలు ఇప్పుడు మోసాలకు, బెదిరింపులకు, తప్పుడు ప్రచారాలకు వేదికలుగా మారుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో కనిపించే ప్రతి ముఖం నిజమైనది కాదు. ప్రతి ప్రకటన నమ్మదగినది కాదు. ఆకర్షణీయమైన ఒక్క లింకు జీవితకాలపు పొదుపును హరించే ప్రమాదకర ఉచ్చుగా మారుతోంది. మొదట్లో స్నేహసంబంధాలకే పరిమితమైన ఈ వేదికలు క్రమంగా వ్యాపార కేంద్రాలుగా విస్తరించాయి. వస్తువుల విక్రయాలు, పెట్టుబడి అవకాశాలు, ఉద్యోగ ప్రకటనలు, ఆర్థిక లావాదేవీలు సాధారణమయ్యాయి. ఈ పరిణామం వ్యాపారులకు అవకాశాలు కల్పించినప్పటికీ, నకిలీ ఖాతాలు, మోసపూరిత ప్రకటనలకు అడ్డుకట్ట పడకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్నేహసంబంధాల కోసం ఏర్పడిన వేదికలను నియంత్రణలేని వ్యాపార కేంద్రాలుగా మార్చడం ఎంతవరకు సమంజసం? ఇటీవల హైదరాబాద్‌లో ఒక యువకుడు 13 నకిలీ ఇన్‌స్టాగ్రామ్, 14 ఫేస్‌బుక్ ఖాతాలు సృష్టించి మహిళగా పరిచయమవుతూ పలువురిని మోసగించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. వ్యక్తిగత చిత్రాలతో బెదిరించి రూ. 25.16 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ముంబయిలో నకిలీ ప్రకటనలు, కస్టమర్ కేర్ పేరుతో జరిగిన మూడు మోసాల్లో రూ. 7 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. ఢిల్లీలో నకిలీ వస్త్ర విక్రయ ప్రకటనపై ప్రారంభమైన దర్యాప్తు సుమారు రూ. 30 కోట్ల అనుమానిత సైబర్ మోసాల వ్యవహారాన్ని వెలికితీసింది. దేశవ్యాప్తంగా 2025లో ఆర్థిక సైబర్ మోసాలకు సంబంధించి 24.02 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో పేర్కొన్న మొత్తం రూ. 22,495 కోట్లు. ఇవన్నీ సామాజిక మాధ్యమాల ద్వారా జరిగిన నేరాలు కాకపోయినా డిజిటల్ మోసాల తీవ్రతకు నిదర్శనం. హైదరాబాద్‌లో 1,457 అనుమానాస్పద ఖాతాలు, 2,603 మోసపూరిత ప్రకటనల తొలగింపునకు చర్యలు చేపట్టాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఖాతాల సృష్టికి నిబంధనలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. ఒకే వ్యక్తి వివిధ పేర్లతో అనేక ఖాతాలు తెరవకుండా నియంత్రణలు విధించాలి. ఖాతాదారుల ప్రామాణికతను గోప్యతకు భంగం కలగని విధంగా నిర్ధారించాలి. ఇతరుల చిత్రాలు, వివరాలతో నకిలీ ప్రొఫైళ్లు సృష్టించడాన్ని సాంకేతికంగా నిరోధించాలి. అనుమానాస్పద ఖాతాలను వెంటనే నిలిపివేయాలి. నకిలీ ఖాతాల విషయంలో వేదికల నిర్వాహకులకు స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా నిషేధించే అంశాన్ని కూడా తీవ్రంగా పరిశీలించాలి. వస్తువుల విక్రయాలు, పెట్టుబడి ఆఫర్లు, ఆర్థిక లావాదేవీలు ప్రత్యేకంగా నియంత్రిత వ్యాపార వేదికల ద్వారానే నిర్వహించేలా నిబంధనలు రూపొందించాలి. వ్యక్తిగత పరిచయాల వేదికల్లో వ్యాపార ప్రకటనలు, చెల్లింపు లింకులు, అనధికార పెట్టుబడి పథకాలకు స్థానం లేకుండా చూడాలి. తప్పుడు వార్తలు, కృత్రిమ మేధతో రూపొందించిన నకిలీ ప్రచారాలను అరికట్టేందుకు పటిష్ఠమైన వ్యవస్థ అవసరం. వినియోగదారులు అపరిచితుల సందేశాలు, ఆకర్షణీయమైన ఆఫర్లు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి. స్నేహాలను కలపాల్సిన వేదికలు ప్రజల పొదుపును కొల్లగొట్టే కేంద్రాలుగా మారడం సహించరానిది. ఖాతా సృష్టి నుంచి సమాచార ప్రచారం వరకు కఠిన నియంత్రణలు అమలులోకి రావాలి. డిజిటల్ స్వేచ్ఛ పేరుతో మోసాలకు స్వేచ్ఛ ఇవ్వకూడదు. ప్రజల భద్రతను కాపాడలేని సాంకేతిక పురోగతికి సామాజిక ప్రయోజనం ఉండదు.

జంతర్ మంతర్ నుండి 'ఢిల్లీ చలో' వరకు...

గత కొన్ని నెలలుగా, భారతదేశంలో మూడు విభిన్నమైన నిరసన ధోరణులు వెలువడ్డాయి– కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన, వామపక్ష విద్యార్థి సంఘాల నిరసనలు, కాంగ్రెస్, 'ఇండియా' వేదిక నేతృత్వంలోని ప్రచారాలు. ఈ ధోరణులు చాలా వరకు విడివిడిగా రూపుదిద్దుకున్నప్పటికీ, ప్రజాస్వామ్యం, నిరసన, పౌర హక్కులు, రాజకీయ, ఎన్నికల ప్రక్రియల పారదర్శకతపై ఉన్న ఆందోళనల చుట్టూ క్రమంగా ఏకమయ్యాయి. విభిన్న అసంతృప్తులను, వర్గాలను ఒకచోటకు చేర్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక పెద్ద సవాల్‌గా మార్చగల సామర్థ్యమే వాటి ప్రాముఖ్యత. కొత్తగా వెల్లువెత్తుతున్న నిరసనలుఈ ఆందోళన మొదటి దశ జూన్ – జులై నెలల్లో జంతర్ మంతర్‌లో జరిగింది. ఇది విద్యా సంస్కరణలు, నీట్ పరిక్షాప్రతాల లీకులు, (అప్పటి) విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌పై దృష్టి సారించాయి. ప్రజల అసంతృప్తిని కూడగట్టడంలో సి.జె.పి కీ0లక పాత్ర పోషించింది. వీధుల్లోకి భారీ సంఖ్యలో యువతను ఆకర్షించింది. అక్కడ విలక్షణమైన హాస్యం, నృజనాత్మకత మేళవింపుతో యువశక్తి తమ సమస్యలను వినిపించింది. పాలకవర్గంపై అసంతృప్తి వ్యక్తీకరణ కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే పరిమితం కాదని, రాజకీయ ప్రమేయం లేని అసంతృప్తిని ఇప్పటివరకు తక్కువగా అంచనా వేస్తున్నట్లు సి.జె.పి నిర్వహించిన ఉద్యమం సూచిస్తుంది. కేంద్ర మంత్రి రాజీనామా ఆ ఉద్యమానికి కొత్త ఊపునిచ్చింది, నికరమైన ప్రజా ఒత్తిడి రాజకీయ రాయితీలను రాబట్టగలదని నిరూపించింది. గాంధీ జయంతి రోజున, ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి, ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అవకతవకల కారణంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద 700 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 10న జంతర్ మంతర్ 2.0 కోసం కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన పిలుపు మరింత తీవ్రమైన అణచివేతను ఎదుర్కొంది. రెండు రోజుల తరువాత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్, 'ఇండియా' వేదిక నాయకులు సెంట్రల్ ఢిల్లీ నుండి అపూర్వమైన రీతిలో 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కుపై విస్తరిస్తున్న పోరాటం ఈ ప్రజా ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉన్నది. 2026 సెప్టెంబర్ ప్రారంభం నాటికి, 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ముసాయిదా ఓటరు జాబితాల నుండి 13.37 కోట్ల మంది పౌరుల పేర్లు తొలగించబడ్డాయి – ఇది 'సర్' చేపట్టక మునుపు ఉన్న ఓటరు జాబితాలో 14.1 శాతానికి సమానం. 'సర్' ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగించే అవకాశం మెండుగా ఉన్నదనే ఆందోళన రేకెత్తిస్తోంది. పేర్లను తొలగించడానికి ఉపయోగించే కేంద్రీకృత సాఫ్ట్‌వేర్, విధానాల విశ్వసనీయతపై ఆందోళనల దృష్ట్యా, ఏకపక్ష తొలగింపునకు వ్యతిరేకంగా తగిన రక్షణలతో ఈ సవరణ పారదర్శకంగా, ధృవీకరించదగినదిగా ఉందా లేదా అనేది ఇవాళ ప్రధాన ప్రశ్నగా నిలిచింది. ఓటర్ల తొలగింపుపై దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ దాఖలు చేసిన రోజునే 'చలో ఢిల్లీ' ర్యాలీ నిర్వహించబడింది. ఓటర్ల జాబితా నుండి ఏకపక్ష తొలగింపునకు వ్యతిరేకంగా రక్షణ ఉండాలని, ఇప్పటి వరకు తొలగించిన జాబితాలను ఆడిట్ చేయడానికి అనుమతించాలని, ఎన్నికల సంఘం పని తీరులో పారదర్శకతను ప్రదర్శించాలని, అలాగే 'సర్' ప్రక్రియ నిలిపివేయాలని కోరుతూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది ప్రజా సమీకరణ, ప్రతిపక్షాల సమీకరణ, నిరోధక చర్యల కలయిక యొక్క రాజకీయ ప్రభావం చెబుతుంది. కార్యనిర్వాహక నిర్ణయాలు న్యాయ పరిశీలన నుండి తప్పించుకోవడానికి వీలు లేకుండా, రాజ్యాంగ హక్కులను న్యాయ సమీక్ష ద్వారా కాపాడాలని దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని డిమాండ్ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు విభేదించినట్లు వెలువడిన నివేదికలు ఎన్నికల సంఘం పనితీరుపై నెలకొని ఉన్న సందేహాలను మరింత బలపరిచాయి. దీంతో 'సర్' ప్రక్రియపై ప్రతిపక్షాలు తమ వ్యతిరేకతను ముమ్మరం చేశాయి. ఎన్నికల నిర్వహణ అనేది ప్రజాస్వామిక జవాబుదారీతనంతో కూడుకుని ఉండాలని డిమాండు చేస్తున్నాయి. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ ఓటరు జాబితా ప్రక్షాళనకు వ్యతిరేకంగా, ఎన్నికల సంఘం ఎన్నికలను నిష్పక్షపాతంగా వ్యవహరించాలనే రాజ్యాంగపరమైన బాధ్యతను గుర్తుచేస్తూ వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. అక్టోబర్ ప్రారంభం నుండి ఈ ఆందోళనలు ఊపు అందుకోవడంతో ప్రతిపక్ష రాజకీయాల్లో గణనీయమైన మార్పునకు దారి తీసింది. 'సర్' ప్రక్రియ రద్దు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్లు ఇంతకు ముందు అసాధ్యమైనవిగా భావించబడ్డాయి. కానీ తాజాగా నిరసనలకు అవే డిమాండ్లు కేంద్ర బిందువుగా మారాయి. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ అన్న అంశాన్ని కూడా ముందుకు తెచ్చింది. ఈ తాజా అంశాలు పార్లమెంటు, న్యాయస్థానాల సంస్థాగత పరిధులను దాటి వీధుల్లోకి వచ్చి చేరాయి. తగిన రక్షణలు లేదా సమర్థవంతమైన నివారణలు, పరిష్కారాలు లేకుండా అర్హులైన పౌరులను ఓటర్ల జాబితా మినహాయించినప్పుడు, ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్య బద్ధతకు ఎంత మాత్రం గ్యారంటీ ఇవ్వలేదు. ఎన్నికల ప్రజాస్వామ్యం నుండి ఎన్నికల నిరంకుశత్వం దిశగా సాగుతున్న పరిణామాల పట్ల సహజంగానే ఆందోళనలు తలెత్తుతాయి. దేశంలో ప్రజాస్వామ్య పతనం ఏ స్థాయిలో ఉందో ఇది తెలియచెబుతోంది. అధికారపక్షం బలహీనతప్రస్తుత పరిణామాలు బిజెపి ఆధిపత్యంలోని దుర్బలత్వాలను బట్టబయలు చేస్తున్నాయి. 2024 సాధారణ ఎన్నికలలో పార్లమెంటరీ మెజారిటీని సాధించడంలో బిజెపి విఫలమవడంతో, ఆ పార్టీకి ఎదురు లేదు, తిరుగు లేదు అన్న భావన ఇప్పటికే పటాపంచలు అయిపోయింది. ఎన్నికల సంస్థాగత నిర్మాణాన్ని తమ పార్టీ సంస్థలకు అనుగుణంగా పునర్నిర్మించుకోవడానికి, ఎన్నికల ఎదురుదెబ్బ పునరావృతం కాకుండా నిరోధించడానికి, అధికారంలో శాశ్వతంగా తిష్ఠ వేయడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న కొద్దీ ఈ ఆందోళనలకు ఆజ్యం పోసినట్లయింది. రాజకీయ పరిష్కారాలను అందించలేకపోయిన మోడీ ప్రభుత్వం, ముఖ్యంగా యువతలో ఎదురవుతున్న అసంతృప్తిని అణచివేయడానికి బలప్రయోగం మీద ఆధారపడింది. అయితే, అటువంటి అణిచివేత చర్యలు ప్రతి పౌరుడికి ఓటు వేయడానికి గల రాజ్యాంగబద్ధమైన హక్కు నిరాకరణకు గురికావడంపై ఉన్న తీవ్రమైన ఆందోళనలను మరుగుపరచలేవు. అరాచకాన్ని రెచ్చగొడుతున్నారని లేదా ప్రభుత్వాన్ని కూల్చేయడానికి ప్రతిపక్షం, సి.జె.పి, వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయని నిందించడం ద్వారా ప్రభుత్వం తనపై వచ్చిన ఆరోపణల నుండి తప్పించుకోలేదు. ఎన్నికల ద్వారా మాత్రమే అధికార మార్పిడి జరగాలని బిజెపి సుద్దులు చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది. ఎన్నికల ప్రక్రియనే తొత్తడంగా మార్చి, ఎన్నికయిన ప్రభుత్వాలనే చీల్చి, కూల్చి అక్రమ మార్గాల ద్వారా అనేక రాష్ట్రాలలో అధికారం చేపట్టిన బిజెపి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడాన్ని ప్రజలు విశ్వసించడం లేదు. అణచివేతను ఆశ్రయించడం ద్వారా, ప్రభుత్వం తన రాజకీయ ఆధిపత్య పరిమితులను బయట పెట్టుకుంది. యువతకు, పాలక వర్గానికి మధ్య ఉన్న అంతరాన్ని, అలాగే అది నియంత్రించే సంస్థలపై ఉన్న నమ్మకాన్ని మరింత దిగజార్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే, అది తన పట్టును కోల్పోతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ రోజున ప్రజాస్వామ్యం పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటు హక్కు గురించిన పోరాటం కీలకమైన అంతిమ పోరాటం. ఈ పరిణామాలు కొత్త రాజకీయ సమీకరణలకు దారితీయనప్పటికీ, అవి నిరసనల జాగాను విస్తరించాయి, కార్యనిర్వాహక అధికార కేంద్రీకరణపై తీవ్రమైన విమర్శలకు దారితీశాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎన్నికల సంఘం ప్రభుత్వానికి ఏజెంటుగా మారిందనే అభిప్రాయం స్థిరపడింది. కాబట్టి ఎన్నికల సంఘం తన నిష్పాక్షికతపై ఉన్న అనుమానాలను తొలగించి, సంస్థాగత స్వయంప్రతిపత్తిని రుజువు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నానాటికీ పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను మితవాద శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా స్థిరమైన రాజకీయ అడ్డుకట్టగా మార్చగలమా లేదా అన్నదే ఇప్పుడున్న సవాలు. ఎన్నికల ప్రక్రియపై ఈ నిరసనల ఉధృతి ...విద్యా వ్యవస్థ, నిరుద్యోగం, పెరుగుతున్న ధరలపై ఉన్న విస్తృత ప్రజా అసంతృప్తితో అనుసంధానం కాగలదా? వాటిని రాజకీయ మార్పుగా అనువదించగలదా? అనేదే మన ముందున్న ప్రధాన ప్రశ్న. సమాధానం కోసం మనం వేచి చూడాలి.



దేశం కోసం యువత నడుం బిగించాలి: ఎంపీ శ్రీమతి డీకే అరుణ



అక్టోబర్ 29 నిర్భయవార్త నీటీ బ్యూరో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో "యువ సంసద్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే ఉద్దేశంతో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' నినాదంతో పాటు 'ఎస్ఐఆర్'పై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం కోసం యువత నడుం బిగించాలని, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మత్తుకు బానిసై తమ అమూల్యమైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది 'ఎస్ఐఆర్' అంశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనిద్వారా అర్హులైన వాస్తవికులకు ఓటు హక్కు లభించి దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసం కాదని, కేవలం దేశ భద్రత కోసం మాత్రమే పనిచేస్తుందని అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో పాలమూరు యూనివర్సిటీ వీసీ వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణా పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు హాజరయ్యారు.





జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

ముఖ్యమంత్రి డీపీఆర్ సిద్ధం చేయండి.. నిధులు తెచ్చే బాధ్యత నాది
డంపింగ్ యార్డును తొలగించే వరకు పోరాటం ఆగదు: ఎంపీ ఈటల రాజేందర్





సంపద సృష్టించే సాంకేతికత అందుబాటులో ఉందని, ఆ విధానాలపై దృష్టి సారించి ఒక్క గ్రాము



జవహర్ నగర్ అక్టోబర్ 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించి, దాని వల్ల ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. డీపీఆర్ రూపొందిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. డంపింగ్ యార్డు బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన జన సంకల్ప యాత్ర మూడో రోజు గురువారం కీసర నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కీసరలో ఆయనకు డంపింగ్ యార్డు బాధితులు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పరిష్కారం చూపాలి

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు బయటకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. తాను ఆరుగురు ముఖ్యమంత్రులతో పోరాడిన వ్యక్తినని, ఎవరిపైనా నిందలు వేసేందుకు ఈ యాత్ర చేపట్టలేదని అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమనే నమ్మకంతోనే జన సంకల్ప యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యను కేవలం డబ్బుల కోణంలో కాకుండా ప్రజారోగ్య సమస్యగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

డీపీఆర్ సిద్ధం చేయండి.. నిధులు తెచ్చే బాధ్యత నాది

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న తాను డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఈటల రాజేందర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే డీపీఆర్ సిద్ధం చేయించాలని, నిధులు సమకూర్చే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేసి డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వం, లక్ష కోట్ల రూపాయలతో మూసీ ప్రక్షాళన ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న లీచేట్ (కలుషిత ద్రవం) కారణంగా చెరువులు కలుషితమవుతున్నాయని, బోర్లలోని నీటి నాణ్యత కూడా దెబ్బతింటోందని ఆరోపించారు. రాంకీ సంస్థ చెత్త నిర్వహణను సక్రమంగా చేపట్టడం లేదని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా చెత్త నుంచి చెత్త కూడా వృథా కాకుండా రీసైక్లింగ్ చేసే వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు.

ప్రజల సమస్యలను విస్మరించవద్దు

ప్రజలు ప్రశ్నించే గొంతుకగా భావించి ఓట్లు వేసి గెలిపించిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరికాదని ఈటల రాజేందర్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజలను నిచ్చెన మెట్లుగా ఉపయోగించుకొని వదిలేయవద్దని హితవు పలికారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడకుండా డంపింగ్ యార్డు బాధితులకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి కేంద్రం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. డంపింగ్ యార్డును తొలగించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసిన ఎంపీ, బాధితులు నేడు నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

భూ రీ సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

పాస్‌బుక్‌లోని భూ ఆధార్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో భూమి లొకేషన్ గుర్తింపు





మేడ్చల్, అక్టోబర్ 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం డబీల్‌పురా గ్రామంలో జరుగుతున్న సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతుల పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన భూ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి లొకేషన్‌ను గుర్తిస్తున్నట్లు మండల తహసీల్దార్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించిన అదనపు కలెక్టర్, సర్వే నిర్వహిస్తున్న రైతులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు. భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే బృందాలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో ఏడీ ఎస్ఎల్ఆర్ శ్రీనివాసులు, ఆర్ఐ కుమార్, సర్వే బృందం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సితార జనప్రియ కాలనీలో కోహినూర్ ఫ్యామిలీ సెలూన్ ప్రారంభం

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించి ఆర్థికంగా స్థిరపడాలి: స్వర్ణరాజ్ శివమణి, విఠల్ నాయక్



కాప్రా అక్టోబర్ 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధికాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడ సితార జనప్రియ కాలనీలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన యూనిసెక్స్ కోహినూర్ ఫ్యామిలీ సెలూన్‌ను మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా సెలూన్‌ను ప్రారంభించిన నిర్వాహకులను అభినందించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని, సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. విఠల్ నాయక్ మాట్లాడుతూ కోహినూర్ ఫ్యామిలీ సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక కాలానికి అనుగుణంగా యువత విభిన్న ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, వ్యాపార రంగంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంపుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనూప్ రాజ్ (టిల్లు) యాదవ్, ఉమ్మడి కాప్రా డివిజన్ మాజీ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాబురావు, జి. సత్యనారాయణ, జగదీశ్ గౌడ్, సి. సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ జాబితాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను పీఎం రాహత్ పథకంలో నమోదు చేయాలి.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.



ఖమ్మం, అక్టోబర్ 29 నిర్భయవార్త రిపోర్టర్. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం క్రింద జిల్లాలోని ఆరోగ్యశ్రీ జాబితాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు తప్పని సరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం రాహత్ పథకం నోడల్ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పథకం లక్ష్యాలు, అమలు విధానం, ఆనువత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎన్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఎంప్యానెల్ అయిన 60 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను పీఎం రాహత్ పథకంలో నమోదు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ప్రతి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాల వివరాలను ఆసుపత్రులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.వచ్చే శనివారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు) అవసరమైన పత్రాలతో ఖమ్మం కలెక్టరేట్‌కు హాజరై పీఎం రాహత్ పథకంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆదివారం అవసరమైన పరీక్షలు నిర్వహించి, వచ్చే సోమవారం నాటికి ప్రతి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఎంప్యానెల్ అయిన అన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు సమాచారం అందించి, పీఎం రాహత్ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. **రోడ్డు ప్రమాద బాధితులకు 7 రోజుల వరకు 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స:** రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 112 అత్యవసర సేవలకు ఫోన్ చేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. పీఎం రాహత్ పథకం ప్రయోజనాలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రమాద ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులను జియో ట్యాగింగ్ చేసి మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోని ఆసుపత్రి వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని 108 అంబులెన్సులకు ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంబులెన్సుల కదలికలు, బాధితులను ఆసుపత్రులకు తరలించే విధానాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోని తగిన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి బాధితులను త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం ప్రధాన ఉద్దేశ్యం రోడ్డు ప్రమాద బాధితులకు డబ్బు లేక చికిత్స ఆలస్యం కాకుండా, 7 రోజుల వరకు 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడటమేనని, ఈ లక్ష్యం నెరవేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఖమ్మం--దేవరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలుఖమ్మం--దేవరపల్లి జాతీయ రహదారిపై అధిక వేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రహదారిపై ప్రమాదాల సంఖ్య అధికంగా ఉండటానికి గల కారణాలను సమగ్రంగా విశ్లేషించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.అధిక వేగాన్ని నియంత్రించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని,ప్రమాదాల నివారణకు అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించా లని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ పీఎం రాహత్ పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏసిపి శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల ద్వారా పేదలను ఆదుకోవాలి

రేషన్‌లో 14 రకాల సరుకులు ఇవ్వాలి
నవంబర్ 1 నుంచి అమరవీరుల వర్ధంతి సభలు
మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై.పుల్లయ్య



కారేపల్లి అక్టోబర్ 29 నిర్భయవార్త రిపోర్టర్. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ధరల భారం నుంచి పేదలకు చౌక దుకాణాల ద్వారా రక్షణ కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై.పుల్లయ్య డిమాండ్ చేశారు.గురువారం కారేపల్లిలో మాస్‌లైన్ కారేపల్లి--కామేపల్లి సంయుక్త మండల కమిటీ సమావేశం సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్యులపై తీవ్ర భారం పడుతోందని, రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని కోరారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని,సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.750 కూలి చెల్లించడంతో పాటు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని కోరారు.భూమి,భుక్తి,దేశ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.సమావేశంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోలేటి నాగేశ్వరరావు,ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ,నాయకులు గుగులోత్ తేజ నాయక్,గుమ్మడి సందీప్,ఎన్‌వీ రాకేష్,దారావత్ సక్రు,బాలు,శ్రీను,రంగయ్య,సరోజిని,అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సీఎం బ్రేక్‌ఫాస్ట్ కిచెన్‌ను త్వరగా ప్రారంభించాలి

అప్పాయిగూడెం మెగా సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే
డ్రైనేజీ,సీసీ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు సూచన
మూడు జిల్లాల విద్యార్థులకు అల్పాహారం అందించేలా ఏర్పాట్లు



కారేపల్లి అక్టోబర్ 29 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామంలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెగా సెంట్రలైజ్డ్ కిచెన్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అప్పాయిగూడెంలో ఏర్పాటు చేసిన కిచెన్ షెడ్‌ను ఎమ్మెల్యే పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ కింద అల్పాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కిచెన్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కిచెన్ పరిసరాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని,షెడ్ చుట్టూ డ్రైనేజీ వ్యవస్థతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ మెగా సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ కింద అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి,చదువుల్లో రాణించేలా చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.విద్యార్థుల ఆరోగ్యం,మెరుగైన విద్య,ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పేర్కొన్నారు.

నిర్వీర్యమైన సీతారామను వినియోగంలోకి తెచ్చా

కరువుపై అవగాహన లేని 'సన్యాసులు' అవాకులు పేలుతున్నారు
సీతారామకు రూ.100 కోట్లు తెచ్చి యంత్రాలను వినియోగంలోకి తెచ్చాం
సింగరేణి మండల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



కారేపల్లి అక్టోబర్ 29 నిర్భయ వార్త రిపోర్టర్. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని,తాను ప్రత్యేక చొరవ తీసుకొని ప్రాజెక్టును వినియోగంలోకి తెచ్చానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు.గురువారం కారేపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే కొత్తూరుతండా వద్ద దేవాదాయ శాఖ సర్వశ్రేయ నిధి (సీజీఎఫ్) రూ.25 లక్షలతో నిర్మించనున్న గ్రామ ముఖద్వార ఆర్చి పనులను ప్రారంభించారు. ఈ నందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే,కరువుపై అవగాహన లేని బిర్లా,రంగా వంటి వారు 'కాంగ్రెస్ తెచ్చిన కరువు' అంటూ అవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు.గత పాలకులు రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఆరోపించారు.ప్రాజెక్టుల నుంచి చుక్కనీరు బయటకు రాని పరిస్థితుల్లో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సీతారామ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు తీసుకొచ్చి యంత్రాలను వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు.వినోభానగర్ వద్ద రాజీవ్ కెనాల్ ద్వారా వైరా నియోజకవర్గానికి సాగునీరు తీసుకొచ్చామని పేర్కొన్నారు.వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఏన్కూర్ మండలానికి ఐటీఐ,గోదాం,100 పడకల ఆసుపత్రితో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.43 కోట్లు,ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించామని చెప్పారు.సింగరేణి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.అటవీ శాఖతో పోరాడి పోడు భూముల్లో బోర్లు వేయించామని,రైతుల వంటల కొనుగోలు విషయంలో పట్టుబట్టి సమస్యను పరిష్కరించామని తెలిపారు.సింగరేణి మండల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధంగా ఉందని,దానికి అనుగుణంగా సాగునీరు,రహదారులు,ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు.అనంతరం మొట్లగూడెంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.పద్మ,తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు,ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్,ఏవో బట్టు అశోక్,ఆర్ఐ జగదీశ్,దేవాదాయ శాఖ అధికారి పగడాల మోహన్‌కృష్ణ,సొసైటీ అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాసరావు,కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల,మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు,దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ,సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.సర్పంచ్‌లు బానోత్ పద్మరూప్లా,మేదరి వీరప్రతాప్,బానోత్ హీరాలాల్,మూడు కిషోర్,పొడుగు పెంటయ్య,పూసం ఎల్లయ్య,కల్తి భద్రయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పర్సా పట్టాభి రామారావు,అడ్డగోడ ఐలయ్య, పెద్దబోయిన ఉమాశంకర్,కాపా చంద్రం, వాంకుడోత్ గాంధీ, పగడాల మోహన్ కృష్ణ,బానోత్ రూప్లా,సుడిగాలి భిక్షం,డేగల ఉపేందర్,బానోత్ రమేష్,జిగట ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయం కోసం పట్టాభిరామ్ ముమ్మర ప్రచారం





నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీచేసే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయం కోసం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. జనసేన మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతోపాటు కార్పొరేషన్ లో పోటీచేసే కూటమి అభ్యర్థుల విజయానికి ఆయన నగరంలో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రచారం చేస్తున్నారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, 16వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి, 'తెలుగు యువత' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ లకు మద్దతుగా గురువారం పట్టాభిరామ్ ప్రచారం చేస్తూ, పర్యటించారు. స్థానిక ప్రజలకు కరపత్రాలు అందజేసి, కూటమి అభ్యర్థులను గెలిపించమని కోరారు.

పి.బి. సిద్ధార్థ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించిన సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్



నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ: అక్టోబర్ 29,2026.:విజయవాడ, మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్ గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఓటర్ల నమోదు, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, బ్యాలెట్ బాక్సుల భద్రత, సిబ్బంది సౌకర్యాల కల్పన తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు నిబంధనల ప్రకారం జరగాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రతను సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు స్ట్రాంగ్ రూమ్‌లు, బ్యాలెట్ పెట్టెలకు కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి వచ్చే ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినన్ని సహాయక కౌంటర్లు, మార్గదర్శక బోర్డులు, మంచినీరు తదితర ప్రాథమిక వసతులు కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, నోడల్ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వీబీ గ్రామీణ్ జీ పనులపై సమీక్ష...

జలసిరి, ఎల్‌నినో కార్యక్రమాల అమలుపై అధికారుల దిశానిర్దేశం

శంకర్‌పల్లి నిర్భయవార్త ప్రతినిధి : శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుభాషిని గురువారం సందర్శించి, వీబీ గ్రామీణ్ జీ పనులు, ఎల్‌నినో కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జలసిరి కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులు, కూలీల సమీకరణ, ఇంకుడు గుంతలు, పశువుల తొట్టెల నిర్మాణం, మేట్ల నియామకం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్, ఎంపీవో గిరిరాజు, ఏపీవో నాగభూషణం, ఈసీ జనార్దన్ రెడ్డి, టీఏ యాదయ్య, కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

తిరువూరులో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్, పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

నిర్భయవార్త ప్రతినిధి :తిరువూరు: అక్టోబర్ 29, 2026.:పట్టణ స్థానిక సంస్థల ఎ న్నికలను పారదర్శకంగా, ప్ర శా ంత వాతావరణంలో నిర్వహిం చేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం తిరువూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక ప్రాంతాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేశారు. లక్ష్మీపురం గ్రామంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కలెక్టర్, ఎన్నికల శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం సెంట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్



కేంద్రాన్ని సందర్శించి ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, వెలుతురు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. శ్రీ వాహిని ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సీసీ కెమెరాల నిఘా, కట్టుదిట్టమైన బారికేడింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్, పోలీసు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను, నంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల్లో ఉండే సిబ్బంది తమ ఓటు హక్కును



వినియోగించుకునే క్రమంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. తిరువూరు పట్టణ పరిధిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ తిరిగి చేపడుతున్న ఓటర్ సమాచారశీ స్లిప్పుల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరుకు గడువులోగా స్లిప్పులు అందేలా పర్యవేక్షించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు తేల్చిచెప్పారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో ఎ.కుమార్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ఞ, తహసీల్దార్ డి.చంద్రమౌళి, ఎంపీడీవో సిహెచ్. రవిబాబు తదితర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా పంట నష్టాల నివారణకు చర్యలు

- పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి
- శాస్త్రవేత్తల సూచనలపై రైతులకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



నిర్భయవార్త ప్రతినిధి :తిరువూరు:అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ రంగానికి ఎదురైన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు అవసరమైన సహాయ నహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పంట నష్టాల అంచనాను వాస్తవ పరిస్థితుల ఆధారంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ.. తిరువూరు మండలం, మల్లెల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వరి పొలాలను సందర్శించి, గాలులకు నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. పంట ఏ దశలో ఉందో, ఎంత విస్తీర్ణంలో పైరు పడిపోయిందో, దిగుబడి, ధాన్యం నాణ్యతపై ఎలాంటి ప్రభావం పడే అవకాశం ఉందో వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాల్లో నిలిచిన మురుగునీటిని వెంటనే బయటకు తోడేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటంతోపాటు, గింజలు మొలకెత్తకుండా, ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పంట నేలకొరిగిన పరిస్థితుల్లో గింజలు మొలకెత్తడం, ధాన్యం రంగు మారడం, ఫంగల్ సంబంధిత సమస్యలు తలెత్తడం వంటి వాటిని తగ్గించేందుకు పంట పరిస్థితిని బట్టి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలను రైతులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎదురైన ఇబ్బందులను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సరైన సమయంలో సాంకేతిక సూచనలు అందించడం, పంటలను సాధ్యమైనంతవరకు కాపాడుకునేలా మార్గనిర్దేశం చేయడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట తిరువూరు ఆర్డీవో ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను అనంతర పరిశుభ్రతే.. ప్రజారోగ్యానికి తొలి రక్షణ!

- ప్రతి వీధి పరిశుభ్రంగా.. ప్రతి గ్రామం ఆరోగ్యంగా ఉండాలి
- క్షేత్రస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:అర్నబ్ తుపాను ప్రభావం తగ్గిన నేపథ్యంలో తుపాను అనంతరం పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ, ప్రజల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఆదేశించారు. తుపాను ప్రభావం ముగిసినా అప్రమత్తత తగ్గించకూడదని, పారిశుధ్య లోపాల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలని స్పష్టం చేశారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో తుపాను కారణంగా ఎక్కడైనా చెత్తాచెదారం, బురద పేరుకుపోయినా, నీరు నిల్వ ఉన్నా యుద్ధప్రాతిపదికన తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా విజయవాడ నగరపాలక సంస్థ , జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రహదారులు, నివాస ప్రాంతాలు, మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తుపాను అనంతర పరిస్థితుల్లో వ్యాధుల వ్యాప్తి అవకాశాలను పర్యవేక్షించాలని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించాలని, అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే పరిస్థితులను గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శుభ్రపరిచిన నీటి ట్యాంకుల సంఖ్య, వినియోగించిన బ్లీచింగ్ పౌడర్ పరిమాణం, తొలగించిన ఘన వ్యర్థాల పరిమాణం టన్నుల్లో, వినియోగించిన ఫాగింగ్ యంత్రాల సంఖ్య, ఫాగింగ్ నిర్వహించిన ప్రాంతాల సంఖ్య వంటి వివరాలతో నివేదికలను సమర్పించాలన్నారు. తుపాను అనంతర పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

"ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా సంకష్టహర చతుర్థి గణపతి హోమం"



నిర్భయవార్త ప్రతినిధి : ఇంద్రకీలాద్రి 29 అక్టోబర్ 2026:మానవులను సమస్త కష్టాల నుండి గట్టెక్కించే సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉ దయం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో సంకష్టహర చతుర్థి గణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. గణనాథుడికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో చవితి ప్రధానమైనదని, సంకటహర చతుర్థి పూజను నిష్ఠతో ఆచరించడం ద్వారా జాతకంలోని గ్రహదోషాలు, నమన్యలు



సమసిపోయి సర్వకార్య సంకటములు తొలగి విజయాలు చేకూరుతాయనే పురాణోక్తిని అనుసరించి దేవస్థాన యాగశాలలో ఈ విశేష పూజలు జరిగాయి.ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో అర్చకస్వాములు విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, దివ్యాభిషేకాలు నిర్వహించి, శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. లోక క్షేమాన్ని, భక్తజనుల ఆయురారోగ్య ఐశ్వర్యాలను కాంక్షిస్తూ సాగిన ఈ హోమంలో పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సరస్ సందడి.. మరో రెండు రోజులు

- జాతీయ సరస్ మేళాను సందర్శించండి
- లఖ్‌పతిదీదీల ఉత్పత్తులను ప్రోత్సహించండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా--2026 సందడి మరో రెండు రోజులు మాత్రమే కొనసాగనుందని, ఈ నెల 31వ తేదీతో మేళా ముగియనున్నందున ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు.అర్నబ్ తుపాను నేపథ్యంలో ఈ నెల 28న తాత్కాలికంగా మూతపడిన సరస్ గురువారం పునఃప్రారంభమైంది. దీంతో పెద్దఎత్తున సందర్శకులతో సరస్ ప్రాంగణం సరికొత్తగా కళకళలాడింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సరస్ మేళాకు వచ్చి వివిధ రాష్ట్రాల లఖ్‌పతిదీదీల స్టాళ్లను సందర్శించారు. వారితో మాట్లాడి సరస్ వేదిక కల్పించిన అవకాశం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమేర అమ్మకాలు జరిగాయో, సందర్శకుల నుంచి స్పందన ఎలా ఉందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన విభిన్న ఉత్పత్తులు, హస్తకళా వస్తువులు, సంప్రదాయ కళాకృతులు, గృహోపకరణాలు, వస్త్రాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను చాటిచెప్పే ఉత్పత్తులతో సరస్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల నుంచి లఖ్‌పతి దీదీలుగా ఎదిగిన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి కృషికి తగిన ప్రోత్సాహం అందించడంతోపాటు, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తల ఆర్థిక స్వావలంబనకు ప్రజలు తోడ్పడాలని పిలుపునిచ్చారు. చివరి రెండు రోజులపాటు ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన ఉత్పత్తులతో సందర్శకులకు వైవిధ్యభరితమైన కొనుగోలు అనుభూతిని అందిస్తున్న జాతీయ సరస్ మేళాను ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఆలస్యం చేయకుండా సరస్ మేళాకు విచ్చేసి, నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయడంతోపాటు లఖ్‌పతి దీదీల విజయ ప్రస్థానంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) డైరెక్టర్ చక్రవర్తి, ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి
అధికారులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం



నిర్భయవార్త ప్రతినిధి :**మెదక్,టౌన్:-** జిల్లాలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను సమగ్రంగా, పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను పరిశీలించారు. చార్జి అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన హౌస్‌లిస్టింగ్ ఫేజ్-1 ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని, అదే స్ఫూర్తితో జనగణన ప్రక్రియను కూడా సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జనగణన ద్వారా సేకరించిన వివరాలు భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈసారి జనగణనలో డిజిటల్ విధానానికి ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్), కులాల వారీగా వివరాల సేకరణపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. జనగణనకు సంబంధించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ సమయంలో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, పరిష్కారం కాని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.జనగణన చట్టం-1948 ప్రకారం సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో వివరాలను పంచుకోరాదని, సమాచార గోప్యతకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలో జనగణన విజయవంతంగా పూర్తయ్యేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శిక్షణ ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలి

రాజకీయ లబ్ధి కోసమే ఈటల పాదయాత్ర సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధి ఏదీ తోటకూర వజ్రేష్ యాదవ్



ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ తన వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన ఈటల రాజేందర్ జవహర్‌నగర్ ప్రజలకు డంపింగ్ యార్డ్ కాలుష్యం నుంచి విముక్తి కల్పించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసమే పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన సమయంలో డంపింగ్ యార్డ్ తరలింపుపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఏళ్లుగా కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటివరకు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొంటూ,కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీగా ఈటల రాజేందర్‌పై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సింది పోయి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం ఎందుకని నిలదీశారు. జవహర్‌నగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని కోరారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని తోటకూర వజ్రేష్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గం డివిజన్ల అధ్యక్షులు మున్సిపాలిటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు మాజీ ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

సింగూర్ క్యాంప్ కాలనీలో ప్రభుత్వ క్వార్టర్ల ఖాళీకి ఫైనల్ నోటీసు ఈ నెలాఖరులోపు ఖాళీ చేయాల్సిందే



సదాశివపేటనిర్భయవార్త ప్రతినిధి :సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పరిధిలోని సింగూర్ క్యాంప్ కాలనీలో నివసిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఖాళీ చేయాలని బుధవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, సీటీపారుదల సబ్-డివిజన్ నెం. 2, సింగూర్ నోటీసులు జారీ చేశారు .సింగూర్ క్యాంప్ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, చాలా కాలంగా శిథిలావస్థకు చేరి, నిర్మాణపరంగా అత్యంత బలహీనంగా ఉన్నాయని, నివాసానికి ఏమాత్రం సురక్షితం కాదని గుర్తించారు.ఈ నేపథ్యంలో ఇంతకుముందు 25 సెప్టెంబర్ 2026 మరియు 6 అక్టోబర్ 2026 తేదీల్లో రెండు సార్లు నోటీసులు జారీ చేసినా, ఇప్పటివరకు సదరు క్వార్టర్లను ఖాళీ చేయలేదని అధికారులు పేర్కొన్నారు.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మెమో నంబర్ : ఈ ఈ/ ఐ డి నెంబర్/ 1 సంగారెడ్డి ఈసీ నెంబర్. 1/2026-27/33 , 23 అక్టోబర్ 2026 ప్రకారం సింగూర్ క్యాంప్ కాలనీ క్వార్టర్లలో నివసిస్తున్న వారు ఈ నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లోనూ క్వార్టర్లను ఖాళీ చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీటీపారుదల డివిజన్ నెం-1, సంగారెడ్డి ఆదేశించారు.కావున నివాసితులందరూ తమ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్లను ఈ నెల చివరిలోగా పూర్తిగా ఖాళీ చేసి, క్వార్టర్ తాళాలు కార్యాలయానికి అప్పగించాలని తెలిపారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక చేయూత.

ఇద్దరు మృతుల కుటుంబాలకు రూ.10 వేల సాయం.



నిర్భయవార్త ప్రతినిధి : **మెదక్ ప్రతినిధి :-** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి తన వంతు ఆర్థిక సహాయం అందించారు. పాపన్నపేట మండలం అబ్లాపూర్ గ్రామానికి చెందిన ముమ్మని బాలయ్య, నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన కాశమైన నర్సింలు మృతి చెందడంతో వారి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.పాపన్నపేట మండలం అబ్లాపూర్ గ్రామానికి చెందిన ముమ్మని బాలయ్య అకాల మరణం పట్ల కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఆయన సూచనల మేరకు గ్రామ బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు.నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన కాశమైన నర్సింలు అప్పుల బాధతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్పందించారు. నర్సింలు మృతి విషయం స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు నగదును అందజేసి పరామర్శించారు. కష్టకాలంలో కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమాల్లో అబ్లాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కానాపురం లింగంగౌడ్, కొంపల్లి కిష్టయ్య, ముమ్మని బాగయ్య, ముమ్మని నర్సింలు, చాకలి కుమార్, శేగ్గరి నర్సింలు, శేగ్గరి రమేష్‌గౌడ్, సీతానగరం నరేష్, చీకోటి ఎల్లప్పతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఢిల్లీ పోరుకు పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు


నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ ధర్నా

ధర్నాకు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణుల బస్సును ప్రారంభించిన కాట దంపతులు



పటాన్‌చెరు,నిర్భయవార్త ప్రతినిధి :ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటంలో భాగస్వాములయ్యేందుకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న భారీ ధర్నాలో పాల్గొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.ఈ సందర్భంగా ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణుల బస్సును పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, ఆయన సతీమణి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నీటిని పొదుపుగా వాడుకోండి" -- మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్. టీ.సుధాకర్ పిలుపు



నిర్భయవార్త ప్రతినిధి :**టేక్మాల్.** టేక్మాల్ గ్రామంలోని ప్రజలందరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సుధాకర్ కోరారు. రాబోయే కాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. తాగునీటిని ఇళ్ల ముందు రోడ్లు కడగడానికి, వాహనాలు కడగడానికి ఉపయోగించి వృథా చేయవద్దని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు లీకేజీల నివారణ: గ్రామాల్లోని పబ్లిక్ నల్లాలు, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని, వాటిని తక్షణమే అరికడతామని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు, వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవలని సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు ఉన్నారు

మానూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ..



నారాయణ్ ఖేడ్ నిర్భయవార్త ప్రతినిధి :నారాయణఖేడ్ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని మానూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు,నవోదైన కేసుల వివరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించారు.కేసుల పురోగతిపై ఆరా తీసి,పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు.అనంతరం సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకుని,విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానూర్ ఎస్సై కోటేశ్వరరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడితో పవన్ కుమార్ భేటీ



నంగునూరు: నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులకు పదవులు, బాధ్యతలు దక్కడం సంతోషకరమని శివచరణ్ రెడ్డి అన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు.నంగునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పవన్ కుమార్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ పిడిశెట్టి ప్రభాకర్. సిర్రం భాను తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై ఎలాంటి అపోహలొద్దు -- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



నిర్భయవార్త ప్రతినిధి : **టేక్మాల్ (ఎక్లస్పూర్)** టేక్మాల్ మండలం ఎక్లాసుపూర్ గ్రామం లో రీ సర్వే పై గ్రామ ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గ్రామ ప్రజలకు నూచించారు. టేక్మాల్ మండలంలోని ఏక్లాస్ పూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మీ గ్రామంలో నిర్వహించబోయే భూభారతి రి సర్వే గురించి ఎలాంటి అపోహలు వద్దన్నారు. రీ సర్వే వల్ల గ్రామంలోని భూములకు పటిష్టంగా హద్దులు నిర్ణయించబడుతుందన్నారు. గ్రామంలో ఉన్న 718 ఎకరాల్లో సర్వే నిర్వహించి ఎలాంటి భూ సమస్యలు ఉన్న 60 రోజుల ముందు నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు , గ్రామకంఠం, ఫారెస్ట్, అసైన్డ్, చెరువు,కుంట భూముల అనంతరం పట్టా భూములను సర్వే నిర్వహించి భూ తగాధాలు లేకుండా తీర్చిదిద్దుతామన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి రి సర్వే మంచి కార్యక్రమం అని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో గ్రామంలో ఉన్న భూమిని రీసర్వే నిర్వహించి రైతులకు అండగా ఉంటామన్నారు.ఏ,డి సర్వే కిషన్ మాట్లాడుతూ.. గ్రామంలో వారం రోజుల్లో ఈ సర్వే ను ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలకాలన్నారు. ప్రతి భూకమతానికి పక్కాగా హద్దులు నిర్ధారించడానికి రీసర్వే అన్నారు.ఆర్ డి వో రమాదేవి మాట్లాడుతూ.. రీ సర్వే గురించి ఎలాంటి సమస్యలున్న అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్, తులసీరామ్ సర్పంచ్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి :సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రైతులకు మద్దతు ధర, సకాలంలో చెల్లింపులు అందించాలిరైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి, వారికి న్యాయంగా దక్కాల్సిన మద్దతు ధర అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారుసంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మారేపల్లి--తొగర్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. తరువాత సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ శాతం నిర్ధారణ, గన్నీ సంచుల సరఫరా, ధాన్యం రవాణా, టార్పాలిన్ల వంటి అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన మేరకు రైతులకు ఆ ప్రయోజనం అందించాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం వారి హక్కు అని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును రైతుల ఖాతాల్లో సకాలంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలకు పంట విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో కీలకమని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగితే వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. ధాన్యం సేకరణ నుంచి చెల్లింపుల వరకు ప్రతి దశను సమర్థంగా నిర్వహించి, రైతులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ డీసీఎంఎస్ వైస్ పట్నం మాణిక్యం పీఏసీఎస్ చైర్మన్లు ఆకుల పవన్ మున్నూరు రాజు, యాదగిరి, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విట్టల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సర్పంచులు రామాగౌడ్, మహేష్, అనిల్ డి.కృష్ణ, పాండురంగం, దేవేందర్, అమరేందర్ రెడ్డి, సాయన్న, మాజీ జెడ్పీటీసీ ప్రేమానందం, రామచంద్రయ్య, ఉ క్ముద్దీన్, రవి, బుచ్చయ్య, నరేందర్ రెడ్డి, జగదీశ్వర్ మోహన్ గౌడ్ శేఖర్ కృష్ణారెడ్డి ఆంజనేయులు గౌడ్ సంషోద్దీన్ ప్రభాకర్ గౌడ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.











విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

నిర్భయవార్త ప్రతినిధి :**టేక్మాల్** గురువారం టేక్మాల మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాన్ని మరియు నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, అడిగి తెలుసుకున్నారు.వివిధ తరగతులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి



ఉపాధ్యాయుల బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్‌కేర్, రిటైల్ ఒకేషనల్ కోర్సుల తరగతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీస్తూ, అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరు తప్పని సరి అని స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర విద్యుత్ పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, మరమ్మతులు అవసరమైన వాటిని వెంటనే బాగు చేయించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత స్థాయిలకు చేరుకోవాలనే లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ తులసీ రామ్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..
- క్షేమంగా ఇంటికి చేరాలి.
అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.

నిర్భయవార్త ప్రతినిధి : ప్రజల ప్రాణరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అదనపు ఎస్పీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు, ధైర్యసాహసాలు పోలీసు శాఖకే కాకుండా సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అమరవీరుల సేవలను ప్రజలకు గుర్తుచేయడంతోపాటు పోలీసుల విధులు, వారు ఎదుర్కొనే సవాళ్లపై అవగాహన కల్పించడమే సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు స్ట్రాప్‌ను బిగించుకోవాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. రహదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. ఇంటి వద్ద తమ రాక కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.అనంతరం పోలీసు అమరవీరుల గౌరవార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, రంగనాథ్, సీఐలు మహేష్, జార్జ్, కృష్ణమూర్తి, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తారా డిగ్రీ కళాశాలనుంచి రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్--

2026కు 11 మంది NSS వాలంటీర్లు, ఐదుగురు సర్పంచులు



సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా తార డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి కార్యక్రమానికి తారా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల బృందము కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన గుజరాత్ లోని కావడిలో జరిగే రాష్ట్రీయ ఏకతా దివస్ పరేడ్లో పాల్గొనుటకు తారా కళాశాల నుండి 11 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపిక కావడం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు సంగారెడ్డి జిల్లా నుంచి 11 మంది జాతీయ సేవా పథకం చీూ వాలంటీర్లు ఐదుగురు సర్పంచులు గుజరాత్‌లో అక్టోబర్ 31న నిర్వహించే రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్--2026లో పాల్గొనేందుకు ఎంపిక అయినారని,ఈ బృందంలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏ, సంగారెడ్డి కు చెందిన ఎన్ఎస్ఎస్ చీూ వాలంటీర్లు పాల్గొనడం కళాశాలకు, జిల్లాకు గర్వకారణంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపినారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ జాతీయ స్థాయి కార్యక్రమం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత, జాతీయ సమైక్యత సందేశాన్ని తమ వాలంటీర్లు చాటి చెప్పనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్గా రవీందర్ రెడ్డి , ఎమ్మార్వో గారు సంగారెడ్డి కలెక్టర్ ఆధ్వర్యంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. చీూ వాలంటీర్ల ఎంపిక పట్ల కళాశాల వర్గాలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారుఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం మరింత పెంపొందుతాయని నిర్వాహకులు మరియు కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందము ఆశాభావం వ్యక్తం చేశారు.



యువ శౌర్య సేన ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచిత ఆత్మరక్షణ శిక్షణ..

మహిళల ఆత్మరక్షణకు 'వీరనారి' శిక్షణ శిబిరం..

శంకర్ పల్లి నిర్భయవార్త ప్రతినిధి :మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆత్మరక్షణ నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో యువ శౌర్య సేన ఆధ్వర్యంలో శంకర్‌పల్లిలో 'వీరనారి' మూడు నెలల ఉచిత ఆత్మరక్షణ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ తెలిపారు. రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, కిత్తూరు చెన్నమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీరనారీమణుల స్ఫూర్తితో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నుంచి తమను తాము రక్షించుకునేలా యువతులు, మహిళలను తీర్చిదిద్దడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని వివరించారు. 25 సంవత్సరాల విశేష అనుభవం కలిగిన కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఆత్మరక్షణ అంటే ఎదుటివారితో పోరాడటం మాత్రమే కాదని, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి సురక్షితంగా బయటపడటం కూడా ముఖ్యమని ఆయన అన్నారు. శారీరక బలంతో పాటు మానసిక దృఢత్వం, సమయస్ఫూర్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో పరిసరాలను అప్రమత్తంగా గమనించాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం గంటసేపు మైదానంలో ఆటలు ఆడటం లేదా యుద్ధకళలు నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. నేను నన్ను నేను రక్షించుకోగలను" అనే ఆత్మవిశ్వాసాన్ని ప్రతి మహిళలో నింపడమే 'వీరనారి' కార్యక్రమం అసలైన లక్ష్యం అని రవీందర్ లంటు యాదవ్ స్పష్టం చేశారు.ఆసక్తి గల యువతులు, మహిళలు నవంబర్ 10వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.





త్రివిక్రమ్‌లో ఈ మార్పు ఏంటి.. ఈసారి ఆ పరిస్థితులకు నో!



వెంకటేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు సినిమా ఇండస్ట్రీలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన రాసే డైలాగ్స్, కథను చెప్పే విధానం, కుటుంబ భావోద్వేగాలను తెరపై చూపించే తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. అయితే త్రివిక్రమ్ సినిమాల విషయంలో అప్పుడప్పుడు కథల గురించి కొన్ని చర్చలు కూడా జరుగుతుంటాయి. ముఖ్యంగా ఆయన కొన్ని సినిమాలు పాత సినిమాల కథలను పోలి ఉన్నాయనే అభిప్రాయాలు గతంలో వినిపించాయి. ఇప్పుడు మాత్రం త్రివిక్రమ్ ఒక రచయితకు ఇచ్చిన క్రెడిట్ ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన ప్రసంగం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా ఈ సినిమా కథకు ప్రత్యేకమైన సలహాలు అందించిన రచయిత, దర్శకుడు కన్నన్ డీఎస్‌ను.. ఆయన ప్రత్యేకంగా అభినందించారు. దీంతో త్రివిక్రమ్ ఈ సినిమాకు సంబంధించి ఏం చేశారు..ఆయన పాత్ర ఎంతవరకు ఉంది..అనే ప్రశ్నలు మొదలయ్యాయి. గతంలో త్రివిక్రమ్ సినిమాల విషయంలో కొన్ని కాంట్రవర్సీలు జరిగాయి. ముఖ్యంగా ఆయన దర్శకత్వంలో వచ్చిన అ ఆ సినిమా కథ పాత సినిమా మీనాను పోలి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలా కథ తీసుకోవడం తప్పుకాక పోయిన రచయితకు ప్రదీప్ ఇవ్వటం చాలా ముఖ్యం అని అప్పట్లో కామెంట్లు పెట్టారు. ఇప్పుడు ఆదర్శ కుటుంబం' సినిమా విషయంలో మాత్రం త్రివిక్రమ్ కన్నన్ డీఎస్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించడం ఆసక్తిని పెంచింది. ఒక కథకు మరో రచయిత అందించిన సహకారాన్ని గుర్తించి, వేదికపై ఆయనను ప్రశంసించడం మంచి పరిణామంగా చూడవచ్చు. మరోవైపు త్రివిక్రమ్ సినిమాలంటే ప్రేక్షకులు ఆయన మార్క్ డైలాగ్స్‌ను ప్రత్యేకంగా ఆశిస్తారు. అందుకే 'ఆదర్శ కుటుంబం'లో కూడా ఆయన శైలిలో ఉండే మాటలు ఉంటాయా.. అన్న ఆసక్తి నెలకొంది. వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్, బ్రహ్మాజీ, సత్య తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 30న సినిమా విడుదలకు సిద్ధమవుతోంది.

రావణుడిపై సాయి పల్లవి కామెంట్స్.. నెట్టింట తెగ ట్రోలింగ్..!



బాలీవుడ్ చిత్రం 'రామాయణ'లో సీతగా నటిస్తున్న సాయి పల్లవి, తాజాగా ఓ ఇంటర్వ్యూలో "రావణుడు పూర్తిగా చెడ్డవాడు కాదు, మనలోని రావణుడిని కూడా గుర్తించి మార్చుకోవాలి" అని చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. దీంతో సినిమా విడుదలకు ముందే ఎందుకిలాంటి వివాదాస్పద వ్యాఖ్యలంటూ కొందరు నెటిజన్లు ఆమెపై తీవ్ర విమర్శలు గుప్పించారు.అయితే, సాయి పల్లవికి మద్దతుగా నిలిచిన మరికొందరు అభిమానులు.. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న యశ్ పాత్ర గురించో లేదా ధార్మిక వేత్తలు చెప్పే సాధారణ విషయాల గురించో ఆమె మాట్లాడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం ఒక చిన్న క్లిప్పింగ్ చూసి నెగెటివిటీని ప్రచారం చేయడం సరికాదని, పూర్తి ఇంటర్వ్యూ చూస్తేనే అసలు విషయం అర్థమవుతుందని స్పష్టం చేస్తున్నారు.

పెద్ద సినిమాల రిస్క్‌ వద్దు.. 'రియాలిటీ'తో సేఫ్ రికవరీ సాధ్యమేనా?

ఇప్పుడు టాలీవుడ్‌లో యంగ్ హీరోలు నటనతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలోనూ తమ ప్రతిభను చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు టాలీవుడ్‌లో యంగ్ హీరోలు నటనతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలోనూ తమ ప్రతిభను చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. అడవి శేషు ,నాని, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి హీరోలు కూడా తమ సినిమాల విషయం లో చురుగ్గా పాల్గొన్నారు. ఇప్పుడు కిరణ్ అబ్బవరం కూడా ఈ జాబితాలో చేరారు. త్వరలో విడుదల కానున్న 'రియాలిటీ' సినిమాకు ఆయన దర్శకత్వం వహిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. ఆ విశేషాలు చూద్దాం.. హీరోల దర్శకత్వ బాధ్యతలు.. ప్లస్సెస్ అండ్ మైనస్సెస్:ఒక నటుడు తెరపై కనిపిస్తూనే, వెనుక ఉండి దర్శకత్వం పర్యవేక్షించడం కత్తి మీద సాము లాంటిదే. విశ్వక్ సేన్ వంటి కొందరు నటులు ఈ సాహసం చేసి సక్సెస్ కొంత సాధించారు. అయితే, నటనతో పాటు డైరెక్షన్ బాధ్యతలు కూడా మోయడం కొన్నిసార్లు సినిమా ఫలితంపై ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదు. అడవిశేషు, నాని, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు కేవలం క్రియేటివ్ పనులకే పరిమితమవగా.. కిరణ్ అబ్బవరం మాత్రం ఏకంగా డైరెక్షన్‌లోకి అడుగుపెట్టడం విశేషం. 'రియాలిటీ' చిత్రంతో కిరణ్ రోల్: గతంలో తన సినిమాలతో మంచి విజయాలు అందుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు 'రియాలిటీ' సినిమా ద్వారా సరికొత్త సవాల్‌ను స్వీకరించారు. ఈ చిత్రానికి కథ అందించడంతో పాటు, లీడ్ రోల్ పోషిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్నారు. ఇక నటుడిగా, దర్శకుడిగా ఆయన చేస్తున్న ఈ తొలి ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. క్రిస్మస్ బరిలో స్మార్ట్ బిజినెస్ వ్యూహం: ఈ క్రిస్మస్ పండుగ సీజన్‌లో సీనియర్ హీరోలైన నాగార్జున 100 సినిమా, బాలకృష్ణ 'దాదా' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు పోటీలో ఉన్నాయి. ఈ ఉద్ధండుల మధ్యే కిరణ్ అబ్బవరం 'రియాలిటీ' సినిమా కూడా విడుదలవుతుండటం గమనార్హం. ఇక పెద్ద సినిమాల



జోరు ఉన్నప్పటికీ, ఈ చిత్రం తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కుతుండటంతో ట్రేడ్ వర్గాల్లో దీనికి మంచి డిమాండ్ ఉంది. బిజినెస్ పరంగా చూస్తే రిస్క్ చాలా తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో, దాదాపు రూ. 16 కోట్ల థియేట్రికల్ రైట్స్ కోసం నలుగురు ప్రముఖ డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇక మొత్తంగా చూస్తే, నటుడిగా తన మార్కెట్‌ను స్థిరపరుచుకుంటూనే.. దర్శకుడిగా అడుగుపెడుతున్న కిరణ్ అబ్బవరం ప్రయత్నం విజయవంతమైతే ఆయన కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్ అవుతుంది. ఇక క్రిస్మస్ పండగ కానుకగా రానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వన్డర్స్ క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

పెద్ది సినిమా వివాదం.. జాన్వీ కపూర్ కీలక నిర్ణయం.. ఇక ఆ సినిమా చేయనంటూ షాక్!

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా పెద్ది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా పెద్ది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ



సినిమా విషయంలో గతంలో ఆమె పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై జాన్వీ స్పందించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తన తప్పును అంగీకరిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. జాన్వీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినిమాల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. తెలుగులో ఇప్పటికే దేవర సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఆమె.. ఆ తర్వాత పెద్ది చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే... అయితే సినిమాలో ఆమె పాత్రను చూపించే విధానంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాజాగా బాలీవుడ్ టాక్ షో కాఫీ విత్ కరణ్‌లో ఈ వివాదం గురించి జాన్వీ మాట్లాడారు. సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో తాను మరింత జాగ్రత్తగా ఉండాల్సిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నటిగా తనకూ బాధ్యత ఉందని, ఏదైనా సన్నివేశం అభ్యంతరకరంగా అనిపిస్తే దానిపై మాట్లాడాల్సిందని ఆమె చెప్పుకొచ్చారు. ఇతరులను నిందించడం కంటే తనవంతుగా ఏం చేయాల్సిందో ఆలోచించడం ముఖ్యమని జాన్వీ తెలిపారు. ఇదిలా ఉంటే, ఫిఫ్టీ షేడ్స్ ఆఫ్ గ్రే సినిమాకు దేశీ వెర్షన్ తీస్తే అందులో ఏ హీరోతో నటిస్తారని జాన్వీని అడిగినప్పుడు, పెద్ది సినిమా అనుభవం తర్వాత అలాంటి సినిమా చేయనని ఆమె చెప్పక వచ్చారు. ఒక సినిమాలో తప్పు ఉంది అంటే అది దర్శకుడు అలానే హీరోయిన్ ఇద్దరి పైన ప్రభావం ఉంటుంది. ఈ క్రమంలో జాహ్నవి తన తప్పు ఒప్పుకొని ఇలా మాట్లాడటం.. చాలామందికి పాజిటివ్గా అనిపించింది. ఒక హీరోయిన్ తన తప్పు ఒప్పుకోవడం చాలా మంచి విషయమని అందరూ కామెంట్లు పెడుతున్నారు. మరి భవిష్యత్తులో జాన్వి ఇలాంటి సినిమాలు కాకుండా మంచి స్క్రిప్టులు ఎంచుకొని తెలుగులో మంచి పేరు తెచ్చుకుంటుందేమో వేచి చూడాలి.

కత్రినను అందుకే దేవతాసుందరిగా ఆరాధిస్తారు!

ఈ కవర్ షూట్‌లో కత్రిన ఫ్యాషన్ సెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రాయల్ వైట్ అండ్ సిల్వర్ ఎత్నిక్ వేర్‌కి ఆభరణాల ఎంపిక ఎంతో రీచ్‌గా ఉంది.కత్రిన కైఫ్‌ను అభిమానులు ఎందుకు దేవతాసుందరిగా, టైమ్‌లెస్ బ్యూటీగా ఆరాధిస్తారో మరోసారి రుజువు చేసింది ఈ తాజా -వోగ్ ఇండియా- కవర్ షూట్. అభూ జానీ సందీప్ ఖోస్లా డిజైనర్ డ్రెస్.. దానికి తగ్గట్టుగా అమర్చిన పార ట్రెడిషనల్ మోడరన్ కాంబినేషన్ జ్యూవెలరీలో ఈ బ్యూటీ రాచరికపు కన్నె సిరిలా మెరిసిపోయింది. దశాబ్దాలు గడుస్తున్నా తన గ్లామర్, డిగ్నిటీ, ప్లాటినం బాడీ లాంగ్వేజ్ ద్వారా ఫ్యాషన్ ప్రపంచంలో క్యాట్ ఐకానిక్ స్టాండర్డ్స్‌ను కంటిన్యూ చేస్తోంది. ఈ వోగ్ కవర్ పేజీలో కత్రిన ప్రదర్శించిన ఎలిగెన్స్, డివైన్ ప్రెజెన్స్ తన ప్రతిష్టను మరింత పెంచాయి. 'రియాలిటీ'తో సేఫ్ రికవరీ సాధ్యమేనా? ఈ కవర్ షూట్‌లో కత్రిన ఫ్యాషన్ సెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రాయల్ వైట్ అండ్ సిల్వర్ ఎత్నిక్ వేర్‌కి ఆభరణాల ఎంపిక ఎంతో రీచ్‌గా ఉంది. ఎంపిక చేసుకున్న ఇయర్ రింగ్స్, సిల్వర్ గాజులు క్లాసిక్ స్టైల్ క పూర్తి రూపానిచ్చాయి. మినిమల్ మేకప్, నాచురల్ హెయిర్‌స్టైలింగ్ ద్వారా --అందం అనేది కష్టపడి సాధించేది మాత్రమే కాదు.. మనసులో నుంచి పొంగిపొర్లే సహజమైన ఆనందం-- అనే విషయాన్ని స్పష్టంగా చాటిచెప్పారు. గడిచిన కొద్దికాలంలో కత్రిన వ్యక్తిగత జీవితంలో విక్కీ కౌశల్‌తో వైవాహిక బంధం.. అలాగే తల్లిగా బాధ్యతల్లో వచ్చిన మార్పులు



తనలో ఒక కొత్త పరిపక్వతను, మానసిక శాంతిని నింపాయి. -మామ్- అయ్యాక కత్రిన ముఖంలో ఒక ప్రత్యేకమైన ప్రశాంతత, పరిపూర్ణత స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను పాటిస్తూనే.. కేవలం గ్లామరస్ రోల్స్ మాత్రమే కాకుండా తన ఆలోచనా విధానానికి తగ్గట్టుగా వైవిధ్యమైన పాత్రలను మాత్రమే ఎంచుకునే ధోరణి ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం కత్రిన కేవలం నటనకే పరిమితం కాకుండా తన సొంత బ్యూటీ బ్రాండ్ -కేబ్యూటీ- బిజినెస్‌ను విస్తరించడంపైనా.. ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లపైనా దృష్టి పెట్టారు. -మెర్రీ క్రిస్మస్-, -టైగర్ 3- సినిమాలతో మెప్పించిన తర్వాత ఈ ఏడాది కంటెంట్ ఆధారిత చిత్రాల్లో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఫర్హాన్ అఖ్తర్ కాంబినేషన్‌లో అనుకున్న భారీ ప్రాజెక్ట్‌తో పాటు పలు ఆసక్తికరమైన కథలు చర్చల దశలో ఉన్నాయి. మల్లీశ్వరిగా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్న కత్రిన.. ఏజ్ లెస్ బ్యూటీగా వెలుగొందుతోంది. మామ్ అయ్యాక రూపం మారిపోయిందని కొన్ని కామెంట్లు వినిపించినా.. తిరిగి కంబ్యాక్ ఎలా ఉంటుందో చూపిస్తోంది. ఫిట్నెస్ ఫ్రీక్ గా తన గ్లామర్ కించిత్ చెదరదని నిరూపిస్తోంది. ఎంతమంది కొత్త కథానాయికలు వచ్చినా.. తనదైన ప్రత్యేక శైలితో -దేవతాసుందరి-గా తన స్థానాన్ని కత్రిన ఎప్పటికీ చెక్కుచెదరకుండా కాపాడుకుంటోంది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197